క్రిస్మస్‌కు ముస్తాబైన చర్చిలు



బేస్తవారిపేట: ప్రత్యేక ఆకర్షణగా పశువుల పాక


పెదారికట్లలో ముస్తాబైన ఆర్‌సీఎం చర్చి

బేస్తవారిపేట: నియోజకవర్గంలో క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబు చేశారు. చర్చిలను విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించడంతో కొత్త శోభను సంతరించుకున్నాయి. కొద్ది రోజులుగా క్రైస్తవులు, విశ్వాసులు క్రిస్మస్ ఆగమనాన్ని పురస్కరించుకొని చర్చిల్లో, తమ ఇళ్లల్లో సెమీ క్రిస్మస్, మినీ క్రిస్మస్ పేరిట ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. క్రిస్మస్ వేడుకల్లో క్రిస్మస్ ట్రీకి కూడా క్రైస్తవులు, విశ్వాసులు అత్యంత ప్రాధాన్యం ఇస్తారు. నిత్య జీవనానికి సంకేతంగా క్రిస్మస్ ట్రీని అలంకరిస్తారు. పలు చర్చిల్లో క్రీస్తు జననానికి చిహ్నంగా పశువుల పాకలను ఏర్పాటు చేసుకుని క్రీస్తు జననం సన్నివేశాలను అలంకరించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

కొమరోలు: స్థానిక ఎస్‌బీఎస్‌ఆర్‌ఎం ఎయిడెడ్ పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ బందుగుల నారాయణరెడ్డి క్రిస్మస్ కేక్ కట్ చేసి చిన్నారులకు పంచిపెట్టారు. అనంతరం క్రిస్మస్ ప్రాముఖ్యత గురించి వివరించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

గిద్దలూరు రూరల్: క్రిస్మస్ పండుగ సందర్భంగా మండలంలోని అన్ని చర్చిలకు రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబు చేశారు. క్రైస్తవులు క్రిస్మస్ పండుగ సందర్భంగా చర్చిల్లో పెద్ద ఎత్తున ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. నంద్యాల రోడ్డులోని పురాతనమైన సీఎస్ఐ చర్చి, క్లబ్ రోడ్డులోని తిరుకుటుంబ చర్చి, ఆర్టీసీ బస్టాండ్ రోడ్డులోని చర్చి, హోసన్న మందిరం, పి.ఆర్.కాలనీలోని నారాయణ చర్చి, మండలంలోని అంబవరం, కె.ఎస్.పల్లె, పాదలకుంటపల్లె, ఉయ్యాలవాడ, సంజీవరాయుడుపేట గ్రామాల్లోని చర్చిలను రకరకాల రంగులతో తీర్చిదిద్దారు.

మార్కాపురం: క్రిస్మస్ వేడుకలకు మార్కాపురం ప్రాంతంలోని చర్చిలు ముస్తాబయ్యాయి. బుధవారం క్రిస్మస్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకునేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది. లోకానికి జ్ఞాన వెలుగులను ప్రసాదించిన క్రీస్తు జన్మదినాన్ని క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పట్టణంలోని పలు దేవుని ప్రార్థన మందిరాలు ముస్తాబయ్యాయి. ఇప్పటికే పలు చర్చిల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. క్రిస్మస్ స్టార్లతో పాటు రంగురంగుల విద్యుద్దీపాలతో చర్చిలను అలంకరించారు. డిసెంబర్ 25 క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆయా ప్రార్థన మందిరాల్లో క్రీస్తు జననం గురించిన బోధనలు వినిపిస్తారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. దేవుని భక్తి గీతాలు ఆలపిస్తారు. క్రైస్తవ సోదరులు తమ గృహాలపై క్రిస్మస్ నక్షత్రాలు విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించుకున్నారు. మార్కాపురం పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో సుమారు 85 వరకు దేవుని ప్రార్థన మందిరాలు ఉన్నాయి. సుమారు 100 మంది దాకా సంఘకాపరులు ఉన్నారు.

క్రీస్తు లూథరన్ చర్చి

ఎస్‌వీకేపీ కళాశాల రోడ్డులోని ఆంధ్రా ఇవాంజికల్ లూథరన్ చర్చి 1933లో ఆవిర్భవించింది. క్రీస్తు లూథరన్ దేవాలయంగా పిలువబడుతున్న ఈ చర్చిని అమెరికా దేశస్తుడు పాదర్ హయ్యర్ ప్రారంభించారు. అమెరికా ఇవాంజికల్ లూథరన్ చర్చిగా ఉన్న ఈ చర్చి కాలక్రమేణ ఆంధ్రా ఇవాంజికల్ లూథరన్ చర్చిగా స్వాతంత్ర్యానికి పూర్వమే మార్పు చెందింది. 1927లో రెవరెండ్ రూగ్లే ఆధ్వర్యంలో చర్చి నిర్మాణానికి ముందు చిన్న పాకలో విద్యా కేంద్రం వెలసింది. అదే చోట ప్రస్తుతం ఉన్న చర్చి నిర్మాణం 1933లో ఏర్పడింది.

ఎస్ఐబీ చర్చి

డివిజన్ కేంద్రం మార్కాపురం పట్టణంలోని పురాతన, చారిత్రాత్మక చర్చిల్లో ఎస్ఐబీ చర్చి ఒకటి. తర్లుపాడు రోడ్డులోని ఏబీఎం పాఠశాల ఆవరణలో ఉన్న ఈ చర్చికి 123 ఏళ్ల చరిత్ర ఉంది. మత ప్రాచుర్యం లేని రోజుల్లోనే చర్చిని నిర్మించినట్లు పలువురు పాస్టర్లు పేర్కొంటున్నారు. ఈ చర్చిని ప్రధాన కేంద్రంగా తీసుకుని విస్తృత ప్రచారం చేస్తూ ఉచిత విద్య, వసతి ఆరోగ్య సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. అలాగే చర్చి ప్రాంగణంలో పలువురు పేదలకు స్వచ్ఛంద సంస్థలు చీరలు, దుస్తులు పంపిణీ చేసే వారు. ఇటీవల ఏబీఎం స్కూల్ వెనుక భాగంలో నూతన చర్చిని నిర్మించారు. మండల పరిసరాల్లో మొట్టమొదట నిర్మించిన ఏకైక ప్రార్థన మందిరంగా ఈ చర్చి ప్రసిద్ధి కెక్కింది. పట్టణంలో ఏ కూటములు జరిగినా ఈ చర్చి ఆవరణలోనే మొదట జరగటం విశేషం.

ఆర్‌సీఎం చర్చి (రోమన్ క్యాథలిక్ చర్చి)

మండలంలోని రాయవరం రైల్వేస్టేషన్ సమీపంలో 1970వ సంవత్సరంలో బిషప్ ఆఫ్ కర్నూలు సంస్థచే ఆర్‌జే రెవరెండ్ డాక్టర్ జోసఫ్ రాజప్పచే ప్రారంభించిన రోమన్ క్యాథలిక్ చర్చి మండల పరిధిలో విశిష్టతను సంతరించుకుంది. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు ఈ చర్చిలో ప్రార్థనలు చేస్తుంటారు.

పల్లెల్లో క్రిస్మస్ కాంతులు

కొనకనమిట్ల: హ్యాపీ క్రిస్మస్ అంటూ క్రిస్మస్ పండగ రానేవచ్చింది. వాడవాడలా క్రిస్మస్ సందడి నెలకొని ఎక్కడ చూసినా క్రిస్మస్ కాంతులు వెదజల్లుతున్నాయి. బుధవారం జీసస్ క్రీస్తు పుట్టిన రోజు కావడంతో గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు ఏసుక్రీస్తు బ్యానర్లతో పాటు న్యూ ఇయర్ బ్యానర్లు ఏర్పాటు చేశారు. కాలనీల్లో చర్చిలను రంగురంగుల దీపాలతో ముస్తాబు చేశారు. ముఖ్యంగా కొనకనమిట్ల, పెదారికట్ల, గొట్లగట్టు, నాయుడుపేట, చినమనగుండం, నాగంపల్లి, నాగరాజుకుంట, ఎదురాళ్లపాడు, మునగపాడు, తువ్వపాడు, చౌటపల్లి, సిద్ధవరం ఎస్సీ కాలనీల్లోని ప్రజలు పండగను అత్యంత భక్తిశ్రద్ధలతో జరపనున్నారు. వారం రోజులుగా సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఇప్పటికే పిండి వంటల తయారీలో మహిళలు నిమగ్నమయ్యారు. పనులకు వెళ్లి పట్టణాల్లో ఉంటున్న క్రైస్తవులు పల్లెలకు తరలి వచ్చారు. ప్రజలు పండగను వేడుకగా జరుపుకొనేందుకు సిద్ధమయ్యారు. కొత్త బట్టలు కొనుగోళ్లు, క్రిస్మస్ స్టార్లు, న్యూ ఇయర్ బ్యానర్లు, స్టార్‌ల కొనుగోళ్లతో ఫ్యాన్సీ షాపుల వద్ద సందడి నెలకొంది.


కొమరోలు : కేక్ కట్ చేస్తున్న పాఠశాల కరస్పాండెంట్ బందుగుల నారాయణరెడ్డి

కిట్స్ కళాశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు

మార్కాపురం టౌన్: స్థానిక కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం కళాశాల కార్యదర్శి అన్నా కృష్ణచైతన్య ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సిబ్బందికి, విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ ప్రేమ, దయ కలిగి ఉండాలని, తోటి వారికి సాయపడాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రంగనాయకులు, ఎన్ఎస్ఎస్ పీఓ అనీల్‌కుమార్, ఏఓ ప్రభాకర్, హెచ్ఓడీలు రామ్మోహన్, అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

పాస్టర్‌లకు నిత్యావసరాల పంపిణీ

పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీలో ఉన్న హెర్మోన్ చర్చిలో జాయ్‌పుల్ టైడింగ్స్ మినిస్ట్రీ డైరెక్టర్ మాకం మోజెస్ 30 మంది పాస్టర్లకు నిత్యావసర వస్తువులను అందించారు.


క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కళాశాల సిబ్బంది


దుస్తులు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

కార్యకర్తల సేవలు ఎప్పటికీ విస్మరించం

- గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను ఎప్పటికీ విస్మరించదని గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి సహకారంతో వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఐకమత్యంతో కలిసిమెలసి జగనన్న ను తిరిగి ముఖ్యమంత్రి చేసుకునేందుకు కృషి చేయాలన్నారు. ఈ నెల 27 వ తేదీ కూటమి ప్రభుత్వం కరెంట్ చార్జీల బాదుడు పై నిరసన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. పట్టణంలోని విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద ప్రజల తరపున నిరసన కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. గృహ వినియోగదారులపై మోపిన రూ.15,485.36 కోట్ల చార్జీలను తక్షణమే వెనక్కు తీసుకోవాలని, ఎన్నికల్లో హామీ ప్రకారం చార్జీల పెంపు నిలిపివేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కొనసాగించాలని వంటి డిమాండ్ల సాధన కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున నిరసన తెలపనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాల్సిందిగా ఆయన కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వేమిరెడ్డి రామచంద్రారెడ్డి, ఓబులరావు, పాలుగుళ్ల నరసింహారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, పాండురంగారెడ్డి, సూరేపల్లె రామక్రిష్ణ, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకే గ్రామసభలు

రాచర్ల: భూ సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నామని తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని అనుమలవీడు గ్రామ సచివాలయంలో మంగళవారం రెవెన్యూ గ్రామ సభలు ఏర్పాటు చేశారు. రెవెన్యూ గ్రామసభలకు 30 అర్జీలు రాగా ఎక్కువగా తల్లి చనిపోతే తండ్రికి, లేదా తండ్రి చనిపోతే తల్లి పేర్ల మీద భూములు ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. అయితే రీ సర్వేలో గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారులు భారీగా ముడుపులు తీసుకుని వారి కుమారులకు ఆన్‌లైన్ చేశారని, వాటిని తొలగించాలని కోరుతూ రైతులు అర్జీలు అందజేశారు. ఈ–పాస్ పుస్తకాల్లో పేర్లు తప్పులు, రైతుల ఫొటోలు లేకుండా ఈ–పాస్ పుస్తకాలు మంజూరు చేశారని రైతులు తహసీల్దార్ వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ భారతిబాయ్, ఆర్ఐ రాఘవ, వీఆర్వోలు కిశోర్‌కుమార్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ రెవెన్యూ సభలో 47 అర్జీలు

గిద్దలూరు రూరల్: గిద్దలూరు మండలం ఆదిమూర్తిపల్లె గ్రామంలో స్థానిక తహశీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సభలో స్థానికులు వారి సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు వివరించారు. పట్టాదారు పాస్‌పుస్తకాల్లో పేరు మార్పులు, పొలం సర్వే చేయించి పాస్ పుస్తకాలు అందించాలని, రేషన్‌కార్డుల కోసం వంటి సమస్యలు మొత్తం 47 అర్జీలు వచ్చాయి. ప్రజలు ఇచ్చే అర్జీల పరిష్కారం కోసం కృషి చేస్తామని తహశీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ భాస్కర్‌రావు, వీఆర్ఓలు వై.పి.రంగయ్య, రాజశేఖరరెడ్డి, వి.వి.రమణ, వెంకటేశ్వర్లు, అచ్చయ్య, ఈశ్వర్‌రెడ్డి, సర్వేయర్ ఆంజనేయులు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

క్లుప్తంగా

ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు

- మాజీ ఎమ్మెల్యేలు అన్నా, జంకె


మాజీ ఎమ్మెల్యే అన్నా


మాజీ ఎమ్మెల్యే జంకె

మార్కాపురం: నియోజకవర్గ క్రైస్తవులకు క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, జంకె వెంకటరెడ్డి శుభాకాంక్షలను తెలిపారు. బుధవారం క్రిస్మస్ పండగను ఆనందోత్సాహాల మధ్య సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. క్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడచుకుని ఇతరుల పట్ల ప్రేమ, శాంతి, దయ, క్షమ గుణం కలిగి ఉండాలని కోరారు.

సోషల్ మీడియా ప్రతినిధులకు దుస్తుల పంపిణీ


దుస్తులు అందజేస్తున్న ఎంపీపీ

కొనకనమిట్ల: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు, పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి పర్యవేక్షణలో మండల సోషల్ మీడియా కో ఆర్డినేటర్లకు మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంగోలు పార్లమెంట్ సమన్వయకర్త డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సౌజన్యంతో మీడియా కో ఆర్డినేటర్లతో పాటు కార్మికులు, దివ్యాంగులకు, జర్నలిస్టులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, పార్టీ జిల్లా విద్యార్థి విభాగం కన్వీనర్ ఏలూరి సంజీవరెడ్డి, సోషల్ మీడియా కో ఆర్డినేటర్లు కొండ్రు వెంకటేశ్వర్లు, టంగుటూరి వెంకటరావు, కోటపాటి బ్రహ్మారెడ్డి, కోలా అనిల్, మార్కు, సొంగా శ్రీనాథ్ పాల్గొన్నారు.

రిటైర్డు లెక్చరర్స్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా వెంగన్న


వెంగన్న (ఫైల్)

మార్కాపురం: స్టేట్ విశ్రాంత లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా పట్టణానికి చెందిన పి.వెంగన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం విజయవాడలో జరిగిన రాష్ట్ర సమావేశంలో తనను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. విశ్రాంత లెక్చరర్స్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

27న వైఎస్సార్ సీపీ పోరుబాట


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, పక్కన వైఎస్సార్ సీపీ నాయకులు

- మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం టౌన్: రాష్ట్రంలో పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా ఈ నెల 27న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోరుబాట చేపట్టినట్లు మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ మార్కాపురం నియోజకవర్గ సమన్వయకర్త అన్నా రాంబాబు అన్నారు. మంగళవారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ 8 దఫాలుగా విద్యుత్ చార్జీలు పెంచిందని, తాను అధికారంలోకి వస్తే చార్జీలను పెంచక పోగా తగ్గిస్తానంటూ బూటకపు మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత గత నెలలో ఒకసారి, ఈ నెలలో ఒకసారి చార్జీలు పెంచుతూ ప్రజలపై భారం మోపడం ఆయనకే చెల్లిందన్నారు. రాష్ట్రంలో రెండు దఫాల్లో పెంచిన విద్యుత్ చార్జీల భారం రూ.15.50 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపారని ధ్వజమెత్తారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న తర్లుపాడు రోడ్డులోని పార్కు నుంచి ఉదయం 11 గంటలకు విద్యుత్ డీఈ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సూపర్ 6 చెబుతూ అధికారంలోకి వచ్చి సుమారు 7 నెలలు అవుతున్నా హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. సూపర్–6 కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని, అమలు చేయకపోగా ప్రజలపై అధిక భారం మోపుతూ విద్యుత్ చార్జీలు పెంచడం ఏమిటని ప్రశ్నించారు. మార్కాపురం నియోజకవర్గంలోని ప్రజలు, నాయకులు, పార్టీ అభిమానులు పార్కు వద్దకు రావాలని, అనంతరం విద్యుత్ కార్యాలయంలోని డీఈకి వినతి పత్రం ఇవ్వనున్నట్లు సూచించారు. సమావేశంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ అలీబేగ్, మున్సిపల్ వైస్ చైర్మన్–2 అంజమ్మ శ్రీనివాసులు, మాజీ ఏఎంసీ చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, కౌన్సిలర్లు చిన్న షెక్షావలి, సలీం, ముంగమూరి శ్రీనివాసులు, చాటకొండ చంద్ర, కో ఆప్షన్ మెంబరు అమీరుల్లాఖాన్, నాయకులు లయోల చెంచిరెడ్డి, గాయం శ్రీనివాస రెడ్డి, కరీంబాషా, పీవీ నాయుడు, షేక్ మహ్మద్ పాల్గొన్నారు.

టెన్నిస్ టోర్నమెంట్‌లో గిద్దలూరు విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

గిద్దలూరు రూరల్: విజయవాడలో ఈ నెల 22 వ తేదీ నిర్వహించిన టెన్నిస్ టోర్నమెంట్‌లో గిద్దలూరుకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరచి మెమొంటోలు సాధించారు. పట్టణానికి చెందిన విశ్వభారతి స్కూల్, అనూష స్కూల్‌కు చెందిన విద్యార్థులు 13 ప్లస్ విభాగంలో ఎం.ఖుర్షిద్, షేక్.కౌషర్, 12 ప్లస్ విభాగంలో భావన, సయ్యద్ సాహెల్‌లు ప్రతిభ కనబరచి మెమొంటోలు సాధించారు. ఈ సందర్భంగా వారిని గిద్దలూరు టెన్నిస్ కోచ్ సీహెచ్.మురళీరెడ్డి, టెన్నిస్ కోర్టు అధ్యక్షుడు డా.సీహెచ్.రంగారెడ్డి, ఎం.అశోక్‌రెడ్డి, త్రిమూర్తులు, డా.మోహన్‌రెడ్డి అభినందించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పొదిలి: ప్రజలు, వినియోగదారులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ అశోక్‌కుమార్ రెడ్డి చెప్పారు. జాతీయ వినియోగదారుల సంఘాల వారోత్సవాల సందర్భంగా మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సంఘ సమావేశం జరిగింది. సంఘాలు ఎప్పటికప్పుడు వినియోగదారులకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ కోరారు. వినియోగదారులు మోసపోకుండా చూడటమే సంఘాల లక్ష్యమని రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు చెప్పారు. పొదిలి తాలూకా అధ్యక్షుడు ధర్నాసి రామారావు మాట్లాడుతూ సెల్‌ఫోన్ సమాచారం, బ్యాంకు ఖాతాల సమాచారం ఇతరులకు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రత్యేకించి ఓటీపీల విషయంలో జాగరూకతతో ఉండాలన్నారు. అనంతరం రక్షణ సమితి సభ్యులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు.

ఈ–పంట నమోదు తప్పనిసరి

కొనకనమిట్ల: రబీ సాగులో పంటలు సాగు చేసిన రైతులు తమ పంటల వివరాలతో ఈ–పంట నమోదు చేయించాలని వ్యవసాయాధికారి ప్రసన్న రంగలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గొర్లదిన్నె, నాగంపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు వ్యవసాయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పంటల బీమా పథకం ఈ నెల 31 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. పంటల బీమా నమోదుకు ఆధార్ కార్డు, పొలం పాస్ బుక్ నకలు తీసుకొని గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు


బ్రహ్మంగారి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో ఈశ్వరీదేవి అమ్మవారు

గిద్దలూరు రూరల్: వీరబ్రహ్మేంద్రస్వామి మనువరాలు ఈశ్వరి మహాదేవి 235 వ ఆరాధన మహోత్సవం సందర్భంగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం వద్ద మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటుగా అల్పాహారం అందించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు రంగాచారి, వీరబ్రహ్మం, చంద్రశేఖర ఆచారి, పాండు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి.ఎస్.నారాయణరెడ్డి, టూరిజంశాఖ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పోకల రామక్రిష్టారెడ్డి, రైల్వే విశ్రాంత ఏఎస్ఐ రోశయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఈశ్వరీదేవి ఆరాధన మహోత్సవాలు

రాచర్ల: కంభం మండలంలోని తుడిమెళ్ల పంచాయతీ పరిధిలోని మదారుపల్లెలో ఈశ్వరీదేవి ఆరాధన మహోత్సవాలు మంగళవారం ఉదయం నుంచి ప్రారంభమయ్యాయి. ఈశ్వరీదేవి అమ్మవారిని పట్టువస్త్రాలు, ప్రత్యేక పూలతో అలంకరించి కుంకుమపూజ, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి అమ్మవారి దర్శనం కోసం అధిక భక్తులు క్యూలో నిలబడ్డారు. భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించి ఆలయం వద్ద కులుకు భజనలు నిర్వహించారు. రాత్రి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పాట కచేరితో పాటు సత్యహరిశ్చంద్ర పూర్తి నాటకాన్ని ఏర్పాటు చేశారు. ఈశ్వరీదేవి అన్నదాన సత్రంలో భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి 12 గంటలకు ఈశ్వరీదేవి అమ్మవారి గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారి గ్రామోత్సవాన్ని చూసేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ధర్మకర్తలు కాకర్ల చిన్న కాశయ్య, కోట. ఈశ్వరయ్య, గోవిందరావు, కోట. శ్రీనివాసులు, ఈశ్వరీదేవి అన్నదాన సత్రం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

మార్కాపురం: పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెలుగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని కోరుతూ ఇటీవల సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారని, ఆ లేఖలోని అంశాలను మంగళవారం విడుదల చేశారు. వెలుగొండ ప్రాజెక్టుకు సంబంధించిన కరపత్రాన్ని కూడా విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ముగ్గురు మంత్రులు ఇటీవల వెలుగొండ ప్రాజెక్టును సందర్శించి రెండు సంవత్సరాల్లో పూర్తి చేస్తామని చేసిన ప్రకటన చూస్తే ప్రజలను మరోసారి మభ్య పెట్టేందుకే అనిపిస్తోందన్నారు. 1996లో శంకుస్థాపన చేసిన ప్రాజెక్టుకు 28 సంవత్సరాలు పూర్తయిందని, ఇప్పటికీ పూర్తికాకపోవడం పాలకుల నిర్లక్ష్యమే అన్నారు. ప్రాజెక్టు పూర్తి చేయాలంటే 3 వేల కోట్లు కావాలని, బడ్జెట్‌లో మాత్రం 394 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. ఈ రకంగా ప్రతి సంవత్సరం కేటాయింపులు చేస్తే ఎనిమిదేళ్లకు ప్రాజెక్టు పూర్తవుతుందన్నారు. ప్రభుత్వానికి రాజకీయ చిత్తశుద్ధి లేదని, దీంతో వేలకోట్లు వృథాగా అదనపు ఖర్చు అయిందన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే పూర్తి చేసి వచ్చే వర్షాకాలంలో రిజర్వాయర్‌లో నీరు నింపే చర్యలు చేపట్టాలన్నారు. నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డీకేఎం రఫీ, జి. బాలనాగయ్య, జవ్వాజి రాజు, ఎస్కే నన్నేసా, నిర్వాసితుల సంఘ నాయకులు ఇండ్లపుల్లారెడ్డి, రామకృష్ణారెడ్డి, లక్ష్మిరెడ్డి, బాలకృష్ణారెడ్డి, వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.